అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 28 మే 2023 పేజీలు : 04

# ఉపాధి హామి కూలీల సంఖ్యను పెంచాలి

## - అమ్మాయిలను బాగా చదివించాలి - జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

**పుట్లూరు, మే 27 ప్రభాతవార్త**

ఉపాధి హామి కూలీల సంఖ్యను పెంచాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పుట్లూరు మండలం కందికాపుల పంచాయతీ, చింతకుంట గ్రామ సమీపంలో ఉపాధి హామి పథకం కింద సుబ్బరాయసాగర్ నుండి పుట్లూరు చెరువు వరకు చేపడుతున్న ప్రధాన కాలువలో పూడికతీత, తదితర పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడి ఉపాధి కూలీలతో మాట్లాడుతూ కాలువ పనులను ఎన్ని రోజుల నుండి చేపడుతున్నారు, కూలి డబ్బులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఇప్పటి వరకు చేసిన పనులకు తమ ఖాతాల్లో కూలి డబ్బులు జమ అవుతోందని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. వంద రోజులు పూర్తి అయ్యేంతవరకు ఉపాధి కూలీ పనులకు హాజరవుతామన్నారు. ఒకరోజు కూలి దాదాపు 220 రూపాలయ వరకు వస్తుందని కలెక్టర్‌కు తెలిపారు. వేజ్‌లిస్టు, మస్టర్ ఆధారంగా కొందరి ఉపాధి హామి కూలీల పేర్లను పిలిచి హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా డిమాండ్ రైజ్ చేసిన మేరకు సగం మంది కూలీలు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. ఉపాధి పనులను మరింత మంది కూలీలు హాజరయ్యేలా వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి కూలీల కుటుంబ స్థితిగతులపై ముచ్చటిస్తూ వారి అమ్మాయిలను బాగా చదివించాలని కోరారు. ప్రస్తుతం ఆడపిల్లలే అన్ని రంగాల్లో ముందంజలో వున్నారని జిల్లాలో అన్నింటా అమ్మాయిలే ర్యాంకులు సాధిస్తున్నారని వారిని బాగా చదివిస్తే వారు మరింతగా ఉన్నత స్థానానికి చేరుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తారన్నారు. వర్షాకాలంలో సుబ్బరాయసాగర్ నుండి కాలువకు నీరు వస్తుందని ఈ కాలువ దాటుకుంటూ తాము తమ గ్రామాలకు వెళ్లాల్సి వుందని ఇక్కడ కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపిడిఒను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఒ మధుసూదన్, ఎపిడి వెంకటరత్నం, డిఎల్‌డిఒ ఒబుళమ్మ, పుట్లూరు మండల తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఎపిఒలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి, చింతకుంట గ్రామసర్పంచు శివరామయ్య, ఇన్‌చార్జ్ జెఇ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# పాదయాత్ర సంబరం..తాకుతోంది అంబరం..!

## - పట్టుదలే మంత్రం..ప్రజాభిమానమే లక్ష్యం - రేపు తాడిపత్రి మండల పాదయాత్ర ముగింపు సభ





ఈ ఏడాది జనవరి 26న పాదం కదిపి కదం తొక్కిన ఉత్సాహం, పెద్దవడుగూరు బహిరంగ సభకు కిక్కిరిసిన జనం

**తాడిపత్రి, మే 27, ప్రభాతవార్త:**

తాడిపత్రి నియోజకవర్గ చరిత్రలోనే ప్రతి మండల కేంద్రంలోనూ ఓ ఎమ్మెల్యే ప్రజా సంక్షేమయాత్ర పేరుతో బహిరంగ సభలు నిర్వహించడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. తమ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రవేశపెట్టిన పథకాలు అర్హులకు ఏ మేరకు చేరాయి, వారి మనోభావాలెలా ఉన్నాయనే విషయాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించడంలో భాగంగా తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి జనవరి 26న పెద్దవడుగూరు మండలం కాశేపల్లిలో ప్రారంభించిన ప్రజా సంక్షేమ పాదయాత్ర మండలాల వారీగా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఈ నెల 29న సోమవారం పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లె పరిధిలో తాడిపత్రి మండల ప్రజా సంక్షేమ యాత్ర ముగింపు సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు. పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలాల పరిధిలో ఈ పాదయాత్ర పూర్తయింది. ఇక యాడికి మండలం మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు దాదాపు 100 గ్రామాలు, 300 కి.మీ మేర కేతిరెడ్డి పెద్దారెడ్డి చుట్టివచ్చారు.

**సఖ్యత, ఐక్యతే బలం..! :** ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజా సంక్షేమ యాత్రకు నియోజకవర్గంలోని నాయకులు ఎవరు సహకరించినా, సహకరించకపోయినా తాను నిత్యం ప్రజల్లోనే ఉండాలనే సంకల్పంతో ముందుకు సాగారు. దీంతో ఆయా గ్రామాల పరిధిలో పాదయాత్ర మిగతా 3 లో

# ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

**అనంతపురం, మే 27 ప్రభాతవార్త బ్యూరో**

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. శనివారం తాడిపత్రి పట్టణం సజ్జలదిన్నె జగనన్న లే ఔట్‌లో నూతనంగా నిర్మించిన లబ్ధిదారురాలు ఎం.నరోజమ్మ గృహాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. లబ్ధిదారులందరూ త్వరితగతిన గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. సజ్జలదిన్నె జగనన్న లే ఔట్ 7.50 ఎకరాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాడిపత్రి మున్సిపల్ పరిధిలోని నాలుగు మేజర్ లే ఔట్లలో ఇది వరకే పట్టాలు అందించడం, గృహాల మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సరోజమ్మ తన సంతోషాన్ని వ్యక్తం చేసిందని, 30 ఏళ్లుగా అద్దె ఇంట్లో నివశిస్తున్న వారు నేడు గృహ ప్రవేశాన్ని చేసుకున్నారని, తమ సొంత ఇంటి కలను నెరవేర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మధుసూధన్, స్థానిక ఎంపిపి సరస్వతి, వాల్మీకి కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, డిఎల్డిఓ ఓబులమ్మ, తాడిపత్రి మండల తహశీల్దారు మునివేలు, ఎంపిడిఓ రంగారావు, మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, ఈఓఆర్డి జిలాన్ బాషా, ఏపిఎం రాజశేఖర్, హౌసింగ్ డీఈలు, ఈఈలు వార్డు అమెనిటీస్ సెక్రెటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించండి

## - సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండండి - జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా ఎస్పి ఎస్.వి.మాధవ రెడ్డి, హాజరైన సంబంధిత శాఖల అధికారులు

**పుట్టపర్తిరూరల్, మే 27, ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీగా మార్చాలన్న సంకల్పం మేరకు శ్రీసత్యసాయి జిల్లాలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నందు ఎస్పి ఎస్.వి.మాధవ రెడ్డితో కలసి మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థులకు వాటి పరిణామాలపై అన్ని శాఖలు సమన్వయం చేసుకొని అవగాహన కల్పించాలని, జిల్లాలోని సచివాలయాల్లోనూ డ్రగ్స్ పోస్టర్లను ప్రదర్శించాలని ఆదేశించారు. బయటి ప్రాంతాల నుండి జిల్లాకు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉండడంతో డ్రగ్ కల్చర్ వచ్చే అవకాశం ఉందని, ఫ్యాక్టరీలు, లేబర్ పరిశ్రమల శాఖ అధికారులు వారి పరిధిలోని పరిశ్రమల్లో డ్రగ్స్ ఎవరైనా ఉపయోగిస్తున్నారా? అన్నది పరిశీలన చేసి సమాచారం అందించాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు తీసుకోవాలని, జిఆల్లలో ఉన్న కర్ణాటక సరిహద్దు ప్రాంతాల పరిధిలోని నిరంతర నిఘాతో అప్రమత్తంగా ఉండాలన్నారు. నాకాబందీ ఏర్పాటు చేయాలని, జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషిచేస్తున్న సెబ్ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పి కె.వి.రామకృష్ణప్రసాద్, సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఇంటెలిజెన్స్ డిఎస్పి గోవింద్, ఆర్డిఓ భాగ్యరేఖ, సోషల్ వెల్ఫేర్ డిడి శివరంగ ప్రసాద్, డిఎంహెచ్ఓ డా.కృష్ణారెడ్డి, డిఇఓ మీనాక్షి, పట్టుపరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, బిసి వెల్ఫేర్ శాఖ అధికారి నిర్మలా జ్యోతి, డిటిడబ్ల్యూఓ మోహన్ రామ్, జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమీషనర్ కరీంబాషా, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**ఈ నెల 31లోపు గ్రామాభివృద్ధి ప్రణాళికలు అందించాలి :** సంసద్ ఆదర్శ గ్రామ్ యోజన క్రింద జిల్లాలో గ్రామాల్లో ఎంపిక చేసిన విలేజ్ డెవలప్‌మెంట్ ప్రణాళికలను ఈ నెల 31వ తేదిలోపు అందించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం సాయంత్రం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్ఎజివై పథకంపై జిల్లా కలెక్టర్ మిగతా 3 లో

# విద్యాభివృద్ధితోనే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు

## - జడ్పి ఛైర్‌పర్సన్ బోయగిరిజమ్మ - 280 మంది వాల్మీకి విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు



మాట్లాడుతున్న బోయ గిరిజమ్మ

**శ్రీసత్యసాయిజిల్లా, మే 27, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఎటువంటి కులవృత్తి లేకుండా సమాజంలో పూర్తి స్థాయిలో వెనుకబడిన బోయ, వాల్మీకులు విద్యతోనే అభివృద్ధితోనే ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉందని ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి పట్టణంలోని సాయి అరామం నందు శ్రీ సత్యసాయి జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 10, ఇంటర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వాల్మీకి ప్రతిభాపురస్కారాల అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విజయకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ సానె మంగమ్మ, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెనుకొండ ఈశ్వరయ్య, పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మినరసమ్మ, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ కుమారి లిఖిత, మాజీ ఛైర్మన్ వీరాంజినేయులు, పుట్టపర్తి మాజీ మున్సిపల్ ఛైర్మన్ పి.సి.గంగన్న, పొగాకు రామచంద్ర, ప్రధాన కార్యదర్శి శివయ్య, హిందూపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కొమ్మూరు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయ గిరిజమ్మ మాట్లాడుతూ, వాల్మీకి వారసులైన మనం ఆ మహర్షి అడుగుజాడల్లో నడచి, ఆ మహర్షి జ్ఞానాన్ని కొంతమేరైనా పొందాలన్నారు. వాల్మీకులు, విద్యార్థులు, ఇతరులకు సమాజంలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలపైన వివక్షత చూపకుండా విద్యపరంగా బాగా ప్రోత్సహించాలని, ఉన్నత లక్ష్యాలు చేరేలా విద్యార్థినీ విద్యార్థులను ఊతమందించాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకొని దాని సాధన కొరకు నిరంతర కృషి ముఖ్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను, విద్యా ప్రోత్సాహాలను వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తన భర్త, తల్లిదండ్రుల ప్రోత్సహంతోనే తాను మిగతా 3 లో














# బాల్య వివాహాలు భవిష్యత్తుకు బారం




సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ హసీనాబాను ,సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి నజ్‌నీన్

**డి.హిరేహాళ్ మే 27 ప్రభాతవార్త**

బాల్యవివాహాలు బాలికల బంగారు భవిష్యత్తు తోపాటు అభివృద్ధి చెందుతున్న మన దేశాభివృద్ధికి బారంగా మారుతుందని ఈసంస్కృతిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని జెడ్పీటీసి, శిశుసంక్షేమ స్టాండింగ్ కమిటీ సభ్యులు హసీ నాబాను పిలుపునిచ్చారు. శనివారం డి.హిరేహాళ్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఐసీడీసీ పీడీ ప్రభావతి అధ్యక్షతన జరిగిన బాల్య వివాహాలను అరికడుదాం అంశంపై మండల స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తి కాకుండా బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరం ఈ విషయం ముందుగా తల్లిదండ్రులకు అవగాహన పరచి బాలికల విద్యాభివృద్ధికి సహకరించేలా చేద్దామని ఆమె తెలిపారు. బాల్య వివాహం ఆపిన తరువాత వారిని ఇంటికే పరిమితం చేయకుండా బాలికలకు నచ్చజెప్పి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్చేందుకు కృషిచేసి వారి దృష్టి ఉన్నత చదువుల వైపు మళ్ళిలా చర్యలు చేపడితే ఈ దుస్థితిని పూర్తిగా అరికట్టవచ్చని ఆమె సూచించారు.



సమావేశంకు హాజరైన ఆశాఖల ఉద్యోగులు

**బడిమానిన (డ్రాపైట్స్)వారిని గుర్తించాలి :** ముందుగా గ్రామాల్లో చిన్న వయసులోనే డ్రాపౌట్స్)బడి మానిన వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన పరచి బాల్య వివాహం జరుగ కుండా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. చిన్నవయసులోనే వివాహం చేస్తే బాలకలు ఎదుర్కొనే సమస్యలు, పుట్టబోయే బిడ్డల దుస్థితి, బిడ్డ సంరక్షణ లాంటి ఎన్నో సమస్యలు ఎదురై చివరికి తల్లిబిడ్డల జీవన సమస్యలు లాంటివి వారికి వివరించి బాల్య వివాహాలకు స్వస్తిపలుకాలని ఆమె వివరించారు.

**సరిహద్దు మండలం సమస్య ఉత్పన్నం :** డి.హిరేహాళ్ మండలం కర్నాటక సరిహద్దున ఉన్నందున బాల్యవివాహాలు జరిపిస్తున్నారని ప్రజాప్రతినిధులు బాధ్యతగా చొరవు చూపితేనే కొంతవరకు అరికట్టడం సులువవుతుందన్నారు. మన ప్రజలు ఇక్కడి కర్నాటక సాంప్రదాయం, వ్యవహారాలు పాటించడం, మూఢనమ్మకాలకు అధిక ప్రాధాన్యత నివ్వడం లాంటి వాటితో బాల్య వివాహాల సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇందులో తహశిల్దారు ఈశ్వర్‌రెడ్డి, ఎస్.ఐ.రంగదుయాదవ్, రాయదుర్గం ఐసీడీసీ సీడీపీఓ ప్రభావతి, డీసీఓ నాగేంద్ర, డీసీపీఓ, ఎంహెచ్ఈఓ రాజశేఖర్‌రెడ్డి బాల్యవివాహాలు అరికట్టే విది విదానాలు, చేపట్టాల్సిన చట్టాలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం లాంటి అంశాలను వివరించారు. బాల్య వివాహాల సమాచారం అందించడం, బాల్య వివాహంకు ప్రయత్నించే తల్లిదండ్రులకు అవగాహన పరచడం తదితర విషయాలు సూచించేందుకు వారధులుగా సర్పంచిలు, ఎంపీటీసీలు, విఆర్ఓ, పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య, అంగన్వాడి, ఆశా కార్యకర్తలతో కమిటీ వేస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ ప్రకటించారు.

## బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ

**బ్రహ్మానముద్రం మే 27 ప్రభాతవార్త,** : మండలంలోని బాల్యవివాహాల నిర్మూలనకై మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో అవగాహన అదస్సు కార్యక్రమం నార్వహించారు. ఈ కార్యక్రమంలో సీడిపీఓ వనజాఅక్కమ్మ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని అరికట్టడంలో ప్రతి అధికారి సచివాలయ ఉద్యోగులతో కలిసి బాల్యవివాహాల నిర్మూలన చేపట్టి బాల్యవివాహాలను అరికట్టాలని అన్నారు.అనంతరం ఎంఈఓ ఓబుళపతి మాట్లాడుతూ గ్రామాలలో పదవతరగతి పూర్తికాగానే పిల్లలకు పెళ్ళిలు చేస్తున్నారని వాటిని అరికట్టాలంటే ఉన్నతచదువులకు వెళ్ళేలా విద్యార్థుల తలిదండ్రులకు అవగాహన కల్పించి బాల్యవివాహాలను అరికట్టేలా ప్రతిఒక్కరూ చర్యలుతీసుకోవాలని అన్నారు.అనంరతరం తమశీల్దార్ బాలకిషన్ మాట్లాడుతూ గ్రామాలలో బాల్యవివాహాలను అరికట్టేందుకు కమిటీలనునియమించాలని కమిటీ చైర్మెన్‌గా నన్ను నియమించాలని అన్నారు మా అధికార బృందంతో కలిసికట్టుగా పనిచేసి బాల్యవివాహాలు అరికట్టే ప్రయత్నాలు చేస్తామని అన్నారు

## వేసవి శిక్షణ శిభిరం



వేసవి శిక్షణ శిభిరం నిర్వహిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం టౌన్, మే 27 ప్రభాతవార్త :** ఇంగ్లీష్ లిటరసీ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జ్యోతిర్మయి బాలికల కళాశాలలో నిర్వహించిన 30 రోజుల స్పోకెన్, కమ్యునికేషన్ ఇంగ్లీష్ వేసవి శిక్షణ శిభిరం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణ తరగతులలో సుమారు 150 మంది విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యంతో పాటు వ్యక్తిత్వ వికాసం, బాడీ లాంగ్వేజ్, ఇంటర్వ్యూ స్కిల్స్ మొదలైన అంశాలలో శిక్షణ పొందారు. విశ్రాంత అధ్యాపకులు మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షకులు వార్డున్ లక్ష్మయ్య, శ్రీనివాసనాయుడు, విజయ్‌క్రిష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంచివరి రోజు పెన్షనర్స్ అసోషియేషన్ సభ్యులు పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, ఆంగ్ల పుస్తకాలు అందజేశారు. గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి చక్కని శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నందుకు ఇంగ్లీష్ లిటరసీ అసోషియేషన్‌ను అందరు సభ్యులు అభినందించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం



మృతి చెందిన బోయ శ్రీనివాసులు

**కళ్యాణదుర్గం టౌన్, మే 27 ప్రభాతవార్త :** మండలంలోని గోళ్ల ఆంజినేయస్వామి గుడి ఎదురుగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన బోయ శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటంపల్లి వద్ద పొలం పనులు ముగించుకుని కళ్యాణదుర్గం వస్తుండగా అనంతపురం నుంచి వస్తున్న షిఫ్ట్ కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

## మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర

### - రాష్ట యువజనసేవలు, క్రీడాశాఖ, కన్నడ సంస్కృతి శాఖల మంత్రిగా నాగేంద్ర

**బళ్లారి, మే27, ప్రభాతవార్త ;** ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారంనాడు ఉదయం 11;45 గంటలకు నూతన మంత్రివర్గ విస్తరణ జరపగా, బళ్లారి జిల్లా నుంచి రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్‌చే కేబినేట్ మంత్రిగా బాధ్యతలు చేపడుతూ ప్రమాణ స్వీకారం చేశారు. సిద్ధరామయ్య కొలువులో మొదటిసారిగా నాగేంద్రకు మంత్రి పదవి దక్కడంతో రూరల్ క్షేత్రం ప్రజలు, జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో హర్షం వ్యక్తమయ్యింది. బీజేపీకి చెందిన ఉన్నత నాయకుడు బి.శ్రీరాములును రూరల్ క్షేత్రంలో 29,300 ఓట్ల ఆధిక్యతతో ఓడించినందుకు గానూ బి.నాగేంద్రకు ఎట్టకేలకు మంత్రి పదవి దక్కింది. మహర్షి వాల్మీకిపేరిట, చేళ్లగుర్కి అవధూత శ్రీ ఎర్రితాతస్వామి పేరిట రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర మొదటిసారిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంలో నాగేంద్ర కుటుంబ సభ్యులతో పాటు జిల్లా నుంచి పార్టీ నాయకులు, రూరల్ క్షేత్రం కాంగ్రెస్ పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు వందలాది సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలిపారు. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఇదే సందర్భంలో వారు మంత్రి పదవి నిర్వహణలో ఎటువంటి లోపాలు జరగకుండా కట్టుదిట్టంగా పాలనా సేవలు అమలయ్యేలా చూడాలని హితవు పలికారు. నాగేంద్రకు రాష్ట్ర యువజనసేవలు, క్రీడాశాఖతో పాటు కన్నడ సంస్కృతిశాఖను కూడా కేటాయించడం విశేషం.

## కాపు రామచంద్రారెడ్డి నాయకత్వంలోనే కొనసాగుతాం

**బొమ్మనహాళ్, మే 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉంతకల్లు క్రాస్ వద్ద వైఎస్ఆర్‌సిపి నాయకులు శాంతయ్య, ఖాసీంలు మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సిపిలో మాకు ప్రాధాన్యత ఉందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నాయకత్వంలోనే కొనసాగుతామని అన్నారు. కొందరు మాపై లేనిపోని మాటలు చెప్పారని, మేము శక్తి వంచన లేకుండా వైఎస్ఆర్‌సిపిలోనే కొనసాగుతామన్నారు. ఎమ్మెల్యే వెంట ఉండి పార్టీ కోసం పని చేస్తామని వారు తెలిపారు.

## పులమతిలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం



వాలంటీర్లను సన్మానించిన సర్పంచు

**లేపాక్షి, మే 27 ప్రభాతవార్త :** మండలంలోని పులమతి గ్రామ సచివాలయంలో సర్పంచ్ అశ్వత్థనారాయణ ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ సారథులు వాలంటీర్లు అని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించడంలో వారు ఎంతో కీలకంగా వ్యవరిస్తున్నారని వాలంటీర్ల సేవలను గుర్తించి వరుసగా మూడవ సంవత్సరం వాలంటీర్లకు సేవా పురస్కారాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే వాలంటీర్లతో పాటు సచివాలయాల వ్యవస్థను రద్దు చేయడం జరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లో ప్రజలతో వాలంటీర్లు మమేకమవుతూ ప్రజలకు జగనన్న చేసిన మంచిని ప్రజలకు వివరించాలన్నారు. గత టిడిపి పాలనలో ఫించన్లు, రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలు వంటివి లబ్ది పొందాలన్నా టిడిపి నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి లంచాలు ఇవ్వాల్సి వచ్చేదన్నారు. అయితే ప్రస్తుతం ఎవరి సిఫారస్ లేకుండానే వాలంటీర్ల ద్వారా పారదర్శకంగా ఇంటికే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వివరించారు. ప్రతి నెలా 1వతేదీన తెల్లవారకమునుపే అవ్వతాతల ముంగిట నిలిచి ఫించన్లు అందిస్తూ వారు చేస్తున్న సేవలకు ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు చెప్పాల్సిందేనన్నారు. అనంతరం వాలంటీర్లకు సేవా పథకాలను అందచేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 31వ తేదిలోగా పెన్షనర్లు ఈ కెవైసి చేయించుకోండి

**కొత్తచెరువు, మే 27, ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లాలోని సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అందరూ సంబంధిత సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఈ కెవైసిని ఈ నెల 31వ తేదిలోపు పూర్తీ చేసుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణయ్య, జనరల్ సెక్రెటరీ ఎం.వి. నాగార్జున శెట్టిలు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న పెన్షన్ దారులు ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఫోన్‌నెంబర్‌లను సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఈకెవైసి చేయించుకోవాలని పెన్షన్ దారులకు సూచించారు. ఈ కెవైసి చేయించకోకుంటే వారికి వచ్చే రాయితీలు కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**కంబదూరు, మే 27,ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని మండల కన్వీనర్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించా రు.ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిధులుగా శెట్టూరు సీనీయర్ నాయకులు నంజుండ్ రావు హాజరయ్యారు.ఈ సమావేశంలో పార్టీ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను చర్చించడంతో పాటు,భారతీయ జనతా పార్టీ హయాంలో 9 ఏళ్ల పాలనలో భారత దేశం అభివృద్ధి కోరకు ప్రధాన మోడి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసు కేళ్లాలని చర్చించారు.అనంతరం కన్వీనర్ చక్రవర్తి మాట్లాడుతూ భారత దేశ అభివృద్ధి మోడితోనే సాధ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నరసింహమూర్తి, కంబదూరు మండల జనరల్ సెక్రెటరీ రాము,రవి,విజయ్ పాల్గొన్నారు

## స్వచ్ఛ భారత్ పారిశుధ్య కార్మికులకు అందని జీతాలు

**కంబదూరు,మే 27,ప్రభాతవార్త:** కంబదూరు పరిధిలో స్వచ్ఛ భారత్ కింద పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సంవత్సరం నుంచి జీతాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నామని మీడియాకు తెలిపారు.దీంతో తమ జీవనాధారం కష్టతరంగా మారిందని వీధులను శుభ్రం చేసే పారిశుధ్య కార్మికుల ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్,పంచాయితీ రాజ్ అధికారులు స్పందించి జీతాలు ఇవ్వాలని వారు కోరుచున్నారు.

## టిడిపి, జనసేన నాయకులకు బెయిల్



రాత్రంతా స్టేషన్‌లో వుండిపోయిన టిడిపి నాయకులు

**హిందూపురం, మే 27 ప్రభాతవార్త :** పట్టణంలోని రహామత్‌పురం సర్కిల్‌లో శుక్రవారం రాత్రి వైసిపికి చెందిన వారు అభ్యంతరకర రీతిలో వేసిన ఫ్లెక్సీని టిడిపి, జనసేన పార్టీలకు చెందిన వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ చించివేసి సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఫ్లెక్సీ చించివేసిన దానికి కారకులుగా భావిస్తూ టిడిపి పట్టణాధ్యక్షులు రమేష్, దాదు, అశోక్‌తో పాటు జనసేన నాయకులు ఉమేష్, మరో ఆరు మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. రాత్రంతా వారిని టూటౌన్ పోలీసుస్టేషన్‌లో వుంచి శనివారం ఉదయం స్థానిక కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. కాగా గొడవకు కారణమైన ఫ్లెక్సీ వేయించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. మరోవైపు జనసేన నాయకులు అరెస్ట్ విషయం తెలుసుకుని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మధ్యాహ్నం కోర్టు వద్దకు వచ్చారు. తదుపరి మీడియాతో మాట్లాడుతూ పార్ట అధినేత పవన్‌కళ్యాణ్‌ను కించపరిచేలా వైసిపి వారు ఫ్లెక్సీ వేసినందునే తమ పార్టీ వారు తొలగించడం జరిగిందని స్పష్టం చేశారు.

## దమ్ముంటే రండి కొట్టుకుందాం

### -టిడిపి నాయకులకు వైసిపి చైర్‌పర్సన్ సవాల్



ధర్నా చేస్తున్న వైకాపా నాయకులు

**హిందూపురం టౌన్, మే 27 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ నాయకులకు దమ్ముంటే ఎంజిఎం క్రీడామైదానానికి రండి కొట్టుకుందామంటూ హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ టిడిపి నాయకులకు సవాల్ విసిరారు. హిందూపురం పట్టణంలోని రహమత్‌పురం కూడలి వద్ద వైసిపి నాయకుడు పేదలకు పెత్తందారులకు మధ్య జరిగేయుద్ధం అంటూ ఫ్లెక్సీలో పేదల పక్షాన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వున్నట్లు ఆయనకు ఎదురుగా పెత్తందారులు అన్నట్లుగా టిడిపి అధినేత చంద్రబాబు, నారా లోకేష్‌లు పల్లకిలో కూర్చుని వుండగా సదరుపల్లకిని జనసేనఅధినేత పవన్‌కళ్యాణ్, తదితరులు మోస్తున్నట్లు టిడిపి, జనసేన అధినేతలను కించపరిచేవిధంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి టిడిపి, జనసేన నాయకులు అక్కడికి చేరుకుని మా అధ్యక్షులను కించపరిచే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారంటూ ఫ్లెక్సీని చించివేశారు. ఫ్లెక్సీ వ్యవహారం ముదిరి వైసిపికి చెందిన కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఇంద్రజ, వైకాపా నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీని చించివేయడాన్ని ఖండిస్తూ పట్టణంలోని ఎంఎల్‌సి ఇక్బాల్ క్యాంపు కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు బైకుర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అక్కడే రోడ్డుపై బైటాయించి ఫ్లెక్సీ చించివేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలు చించడం సాంప్రదాయం కాదు

### - ఏపి ఆగ్రోస్‌చైర్మన్ నవీన్‌నిశ్చల్



మీడియాతో మాట్లాడుతున్న నవీన్‌నిశ్చల్

**హిందూపురం, మే 27 ప్రభాతవార్త :** ఒక పార్టీ వారు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను మరొక పార్టీకి చెందిన వారు చించివేయడం సాంప్రదాయం కాదని ఏపి ఆగ్రోస్‌చైర్మన్ నవీన్‌నిశ్చల్ అన్నారు. హిందూపురం పట్టణంలోని రహమత్‌పురం కూడలి వద్ద వైసిపి నాయకుడు పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శుక్రవారం రాత్రి టిడిపి, జనసేన నాయకులు చించివేయడాన్ని ఖండిస్తూ శనివారం ఏపి ఆగ్రోస్‌చైర్మన్ నవీన్‌నిశ్చల్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోతో వున్న ఫ్లెక్సీని టిడిపి, జనసేన నాయకులు చించివేయడం సరికాదని ఫ్లెక్సీలు చించే సాంప్రదాయం గతంలో హిందూపురంలో లేదని ఫ్లెక్సీలపై అభ్యంతరాలు వుంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలే గాని ఇలా దౌర్జన్యంగా ఫ్లెక్సీలు చించడం ఏంటని ప్రశ్నించారు. వైసిపి నాయకుడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో అసలు తప్పేముందన్నారు. ఎవరైతే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీని చించివేశారో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఇర్షాద్, డాక్టర్ బాష, నాగేంద్ర, వేణురెడ్డి, చంటి, తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యనివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రవాణశాఖ అధికారులు

**హిందూపురం టౌన్, మే 27 ప్రభాతవార్త :** కాలుష్య నివారణపై శనివారం రవాణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాహన కాలుష్యాన్ని తగ్గిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ అధికారులు పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణశాఖ జిల్లా అధికారి కరుణసాగర్‌రెడ్డి, డిఎస్‌పి కంజాక్షన్‌లు మాట్లాడుతూ వాహనకాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. వాహన కాలుష్యం నివారణతోనే పర్యావరణాన్ని కాపాడవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు రమణ, శివశంకర్, జయశ్రీ, ఒకటవ పట్టణ సిఐ ఈరన్న, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీగాంధీ హరిజన హాస్టల్ విడపనకల్లు మండల కమిటీ ఎన్నిక

**విడపనకల్లు, మే 27 ప్రభాతవార్త :** శ్రీగాంధీ హరిజన హాస్టల్ బీద విద్యార్థుల సహాయ సంఘం కమిటీ సభ్యులు విడపనకల్లు మండల కమిటీని మండల ఇన్‌చార్జ్ ఎర్రిస్వామి ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా హావళిగి నాగేష్, ఉపాధ్యక్షులుగా కొట్టాలపల్లి నాగేష్, కరకముక్కల గురుప్రసాద్, ఓబులేసు, అల్లెప్ప, ఉమాశంకర్, రామాంజినేయులు, గంగరాజు, ప్రధాన కార్యదర్శులుగా పోలికి సుధాకర్, నారాయణస్వామి, గంగన్న, తిమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా అంజి, బలరాం, భూపతి, నెట్టికల్లు రాము, రామాంజినేయులు, ట్రెజరర్లుగా విడపనకల్లు నాగంద్ర, కొట్టాలపల్లి సోమశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్య క్రమంలో ఆనంద్‌రాజ్, వీరప్ప, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

## ఉద్యోగుల బదిలీలు సర్వసాధారణం

### - ఎస్.పి. ఎస్.వి. మాధవ రెడ్డి



పోలీసులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి

**పుట్టపర్తి, మే 27, ప్రభాతవార్త :** ఉద్యోగ జీవితంలో బదిలీలు అనేవి సర్వ సాధారణమని, ఎక్కడైనా అంకితభావంతో విధులు నిర్వర్తించడమే ముఖ్యమని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పి ఎస్.వి.మాధవ రెడ్డి అన్నారు. పోలీస్ శాఖ సాధారణ బదిలీల్లో భాగంగా రెండవరోజైన శనివారం శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 7 మంది ఎఎస్‌ఐలు, 24 మంది హెడ్ కానిస్టేబుళ్ళకు కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా బదిలీల ప్రక్రియ కొనసాగింది. జిల్లాఎస్పి ఎస్.వి.మాధవ రెడ్డి స్వయంగా బదిలీ అవుతున్న పోలీస్ అధికారులతో మాట్లాడి వారి వ్యక్తిగత సమస్యలు, పిల్లల చదువులు, కుటుంబ సభ్యుల ఆరోగ్యపరిస్థితులు, స్పౌజ్ కోటాకుప్రాధాన్యత కల్పించి గతంలో వారు పని చేసిన పోలీస్ స్టేషన్‌లకు కాకుండా వివిధ పోలీస్ స్టేషన్‌లలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేశారు. ఈ బదిలీల్లో ఎటువంటి సిఫార్సులకు తావు లేకుండాపూర్తిగా పారదర్శకంగా నిష్పక్షపాతంగా సిబ్బంది కోరుకున్న చోటుకు బదిలీ నిర్వహించినట్లు ఎస్పి తెలియజేశారు. ఈ కౌన్సిలింగ్ ప్రక్రియలో ఎస్పితో పాటు ఎఎస్పి కె.వి.రమాకృష్ణప్రసాద్, ఎస్‌బి సిఐ రవీందర్ రెడ్డి, సిసి రాఘవేంద్ర, ఎ1 సూర్యతేజ, ఐటికోర్ సిబ్బంది ఎఆర్ అడ్మిన్ ఆర్ఐ టైటాస్, డిఓ క్లర్క్ మస్తాన్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సిలింగ్‌కు హాజరైన ఎఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళు

## వార్త కథనానికి స్పందించిన ఫుడ్ ఇన్స్పెక్టర్

### - బెస్ట్ యూనివర్సిటీ క్యాంటిన్‌లో పురుగుల ఆహారం నిజమే ఫుడ్ ఇన్స్పెక్టర్ తస్లీమా- నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవు



తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్



వివారాలు సేకరిస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్

**గోరంట్ల,మే 27,ప్రభాతవార్త:** మండల పరిధిలోని గౌనివారి పల్లి పంచాయితీ కమ్మలవాండ్ల పల్లి సమీపంలో బెస్ట్ కళాశాల వసతి గృహంలోని క్యాంటీన్లో విద్యార్థులకు అందిస్తున్న అన్నంలో చిన్న చిన్న పురుగులు వస్తున్న విషయం విద్యార్థినులతో జరిపిన ముఖా ముఖిలో వెల్లడైనట్లు హిందూపురం ఫుడ్ ఇన్స్పెక్టర్ తస్లీమా వెల్లడించారు.శనివారం బెస్ట్ కళాశాలలోని వసతి గృహంలోని క్యాంటీన్‌లో పురుగుల అన్నం పెడుతుండటం,దీన్ని ప్రశ్నించిన వారిపై గొడవకు దిగడం ఘటనలు విద్యార్థినులు మాధ్యమాల్లో చర్చించుకోవడం,విద్యార్థి సంఘాలు పోలీసులకు ఫిర్యాదుచేయడంపై శనివారం వార్తకథనాలు ప్రచురితమైయ్యాయి. తీనిపై స్పందిచిన హిందూపురం ఫుడ్ ఇన్స్పెక్టర్ తస్లీమా శనివారం మద్యాహ్నం బెస్ట్ కళాశాల వసతి గృహంలోని క్యాంటీన్‌ను తనిఖీ చేసి విద్యార్థినులతో ముఖాముఖి విచారించారు.అనంతరం విలేకలులతో ఎఫ్.ఐ. తస్లీమా మాట్లాడుతూ వారంరోజులుగా వసతి గృహం క్యాంటీన్లో అందిస్తున్న భోజనంలో చిన్న చిన్న పురుగులు (ఇన్ సెక్ట్స్) ఉన్న విషయం విద్యార్థినులు వివరిస్తూ ఫిర్యాదు చేశారని స్పష్టం చేశారు.పరీక్షల నిమిత్తం క్యాంటీన్లో వండిన ఆహారం నమూనాలు సేకరించామని వీటిని ల్యాబ్‌కి పంపామని భోజనంలో పురుగులుఉన్న,భోజనంలో నాణ్యతలేకపోయినా చర్యలు తప్పవని తెలిపారు.ఇదిలాఉండగా నాణ్యమైనఆహారం పిల్లలకు అందించాలని, నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని క్యాంటీన్ నిర్వాహరులకు హెచ్చకించినట్లుగా చేప్పారు.వంట చేసే సందర్భంలో చుట్టూ పరిసరాల సైతం శుభ్రంగా ఉండేలా,వంట గదిలో పురుగులు,బొద్దింకలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.అంతేకాకుడా మరోకసారి క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని,ఇదే పరిస్థితి ఉంటే క్యాంటీనఖను సీజ్ చేస్తామని వెల్లడించారు.

## వాలంటీర్‌ను పరామర్శించిన ఎంఎల్‌సి వై.శివరామిరెడ్డి



వాలంటీర్‌ను పరామర్శిస్తున్న ఎంఎల్‌సి వై.శివరామిరెడ్డి

**విడపనకల్లు, మే 27 ప్రభాతవార్త :** మండలంలోని మాళపురం గ్రామంలో వాలంటీర్ ఓబులేసు గుండె ఆపరేషన్ చేయించుకోవడంతో శనివారం ఎంఎల్‌సి వై.శివరామిరెడ్డి వాలంటీర్ గృహానికి చేరుకుని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌సి వెంట విడపనకల్లు మాజీ ఎంపిపి రమణారెడ్డి, రాంబాబు, మాలాపురం వైసిపి నాయకులు కేశన్న, గురుస్వామి, గోపి, డీలర్ రవి, మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ శ్రీలేఖ, భూమా విజయ్, లోకరాజు, సురేష్, బెల్లం, వెంకటేష్, తదితరులు వున్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతుడు మల్లేష్ (ఫైల్ ఫోటో)

**కంబదూరు,మే 27,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కదిరిదేవరపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ (36) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు.వివరిల్లోకి వెళితే కొత్త ఇంటి నిర్మాణం పనులు కోసం ఇంటి ముందు కొత్త నీటి సంపును ఏర్పాటు చేశారు.అయితే నీటి సంపులో కరెంట్ ఫ్లష్ బాక్స్ తీగలు పడడంతో దానిని గమనించని అతడు నీటి సంపులోకి దిగాడు అప్పటికే కరెంట్ నీటి సంపులోకి సప్లై కావడంతో కరెంట్ షాక్ తగిలి నీటిలోనే మృతి చెందినట్లు గ్రామస్తులు,కుటుంబ సభ్యులు తెలిపారు.

## దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



డాక్టర్ రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

**చిలమత్తూరు, మే 27 ప్రభాతవార్త :** దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని, అంగవైకల్యం దీనికి అడ్డు రాకూడదని నిజజీవితంలో సకలాంగుల కన్నా మీరే గొప్ప మేధాశక్తి కలిగిన వ్యక్తులని చిలమత్తూరు మండల వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన కొడికొండలోని సమర్థనం ట్రస్ట్‌ను సందర్శించారు. దివ్యాంగులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులుగా వున్న మీరు దివ్యాంగులని మరిచిపోవాలని విద్యార్థులకు సూచించారు. మీరు అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే సాధన చేయాలన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఏవైనా వుంటే నన్ను సంప్రదించాలని తెలిపారు. అనంతరం సమర్థనం ట్రస్ట్ సెంటర్ హెడ్ డాక్టర్ రామకృష్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమర్థనం ట్రస్ట్ సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, ట్రైనర్లు నరసింహులు, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

